సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించుకున్నా చట్టరిత్యా నేరమని కలెక్టర్ టిఎస్.చేతన్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ సలహా కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం అదనపు జిల్లా జడ్జి కె.శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. పిసి, పిఎస్ డిటి చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సంబంధిత అధికారులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించని కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆర్ఎంపీ వైద్యుల వైద్య చికిత్సలపై సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై డాక్టర్ల పై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు జడ్జి శైలజ మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 18 ఏళ్ల బాలికలకు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. కాగా సరైన సమాచారం లేకుండా సమావేశానికి వచ్చిన డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిపిఒ డాక్టర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా నర్సింగ్ అధికారి వీరమ్మ, ఆర్‌డిటి బత్తలపల్లి డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రయివేటు దోపిడీ..!

- ఆరోగ్య శ్రీ ఉన్నా అదనపు వసూళ్లే
- నాలుగు ఆసుపత్రులకు జరిమానా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లో దోపిడీ రాజ్యమేలుతోంది. ఎవరికైనా ఆరోగ్య బాగోలేదని పోతే ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు నెలకొన్నాయి. అది కూడా వైద్యం సక్రమంగా అందించే పరిస్థితుల్లేక ప్రాణాల మీదకు కూడా వస్తున్నాయి. జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ అంశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఇటీవల చర్చకు రావడం గమనార్హం.

తప్పుడు వైద్యంతో ప్రాణాల మీదకు..

అనంతపురం నగరంలో ఉండే ఒక వ్యక్తి బైకులో వెళ్తూ కిందపడి కాలుకు చిన్నపాటి ఫ్యాక్షర్ అయింది. సదరు వ్యక్తి నగరంలోని ఒక ప్రయివేటు నర్సింగ్ హోంలో ఆపరేషన్ నిమిత్తం వెళ్లాడు. అక్కడి వైద్యులు బెంగళూరు నుంచి నిపుణులొచ్చి వైద్యం అందిస్తారని చెప్పడంతో వైద్యం చేయించుకునేందుకు ఆయన అంగీకరించాడు. బెంగుళూరు నుంచి వస్తారని చెప్పిన నిపునుడు రాకపోవడంతో వారి ఆసుపత్రిలో పని చేస్తున్న వారే శస్త్ర చికిత్స చేశారు. ఆ శస్త్ర చికిత్స వికటించి సదరు వ్యక్తి ప్రాణాల మీదకొచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే హుటాహుటిన బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు చేయించుకుని ఆయన ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. వికటించిన వైద్యాన్ని సరిచేయడానికి రూ.20 లక్షల వరకు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదట చికిత్సలు చేసిన అనంతలోని కార్పొరేట్ ఆసుపత్రి మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్టుగా మిన్నకుండిపోవడం గమనార్హం.

గుండె జబ్బు లేకున్నా గుండె ఆపరేషన్..!

శెట్టూరు మండలానికి చెందిన ఒక యువకుడు చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా వెంటనే గుండెకు శస్త్రచికిత్స చేయాలని అక్కడి వైద్యులు చెప్పారు. అనుమానం వచ్చి వాళ్లు ఆ ఆసుపత్రిలో కాకుండా బెంగళూరులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. సదరు వ్యక్తికి ఎటువంటి గుండె జబ్బులేదని తేల్చారు. అయితే అనంతలోని కార్పొరేట్ ఆసుపత్రి మాత్రం ఏమీ లేకున్నా ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసి డబ్బులు దండుకునేందుకు సిద్ధపడినట్టు ఆరోపణలున్నాయి.

మొక్కుబడి జరిమానాలతో సరి

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందివ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి ఆరోగ్య శ్రీని అమలు చేస్తోంది. అనంతపురం నగరంలోని ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రం ప్రభుత్వమిచ్చే డబ్బులు సరిపోవు... మంచి వైద్యమందివ్వాలి.. అదనంగా డబ్బులు పెట్టుకోవాలని రోగులకు చెబుతున్నారు. రోగులు విధిలేని పరిస్థితుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ రకంగా చెల్లించి ఆరోపణలొచ్చిన వాటిపై వైద్యఆరోగ్యశాఖ తనిఖీల్లోనూ తేలింది. ఇలా తనిఖీలు నిర్వహించి డిస్ట్రిక్టు డిసిప్లనరీ కమిటీ తేల్చినవే నాలుగు ఆసుపత్రులున్నాయి. ఇందులో సాయిరత్న ఆసుపత్రి రోగి నుంచి ఎనిమిది వేలు అదనంగా వసూలు చేసినట్టు తనిఖీలో తేలడంతో రూ.80 వేలు జరిమానా విధించారు. ఇక కిమ్స్ సవేరా ఆసుపత్రి అదనంగా ఐదు వేలు వసూలు చేసినందుకు రూ.25 వేలు జరిమానా విధించారు. ఎస్ఆర్ ఆసుపత్రి ఆరు వేలు అదనంగా వసూలు చేసినందుకు రూ.30 వేలు జరిమానా విధించారు. ఇలా ఉన్నతాధికారులు సాధారణ జరిమానాలు వేసి సరిపెట్టేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైద్యం పేరుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గడ్డితిని స్వచ్ఛభారత్ కార్మికుల నిరసన

గడ్డి తిని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-గాండ్లపెంట

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛభారత్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్టాప్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన శనివారం దీక్షా శిబిరంలో కార్మికులు వినూత్న రీతిలో గడ్డి తిని నిరసన వ్యక్తం చేశారు. వారికి రైతు సంఘం మండల నాయకుడు కెకె.రాజారెడ్డి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 20 నెలలకు పైగా కార్మికులకు వేతనాలు అందకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని అధికారులను ప్రశ్నిం చారు. వేతనాలు చెల్లించేంత వరకూ విధులకు హాజరుకామని పలుమార్లు అధికారులకు స్పష్టం చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వేతనాలు చెల్లించకపోతే గడ్డి తిని బతకాలా అని కార్మికులు గడ్డి తిని నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించేంత వరకూ దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అధికారులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. దీక్షా శిబిరంలో స్వచ్ఛభారత్ కార్మికులు అక్కులప్ప, అంజి, కదిరప్ప, అనిల్, గంగన్న, దొడ్డప్ప, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేకపోవడంతో తలుపునకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

నాణ్యమైన విత్తన వేరుశనగ ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ అధ్యక్షతన వ్యకాసం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రైతు సేవా కేంద్రంలో ఉద్యోగి బాబావలికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో ఎకరాకు 5 బస్తాలు చొప్పున నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. అలాగే రైతు కూలీలను ఆదుకోవాలని కోరారు. అయితే ఉదయం 11.25 గంటలైనా రైతు సేవా కేంద్రం తెరవకపోవడంతో తలుపులకు వినతిపత్రం అతికించారు. ఏవోకు ఫోన్ ద్వారా విషయం తెలపగా బదిలీల విషయమై జిల్లా కార్యాలయంలో ఉన్నానని పేర్కొంటూ సచివాలయం సిబ్బంది బాబావలిని అక్కడికి పంపించారు. దీంతో వారు బాబావలికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, నాగభూషణ, రవి, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ, సిపిఎం నాయకులు వెంకటేశులు, ఈడిగ నాగరాజు, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు బెస్త క్రిష్టప్ప, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు కుమ్మర కిష్టప్ప, కంచె శ్రీనివాసులు, నేసే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి దిశగా పాలన

- మహానాడులో టిడిపి నాయకులు
- 22 తీర్మానాలు చేస్తూ ప్రతిపాదన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని టిడిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పష్టం చేశారు. సత్యసాయి జిల్లా టిడిపి మహానాడును పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ వద్ద శనివారం నిర్వహించారు. తెలుగుదేశం జెండాను ఎమ్మెల్యేలు, నాయకులు ఎగురవేసి మహానాడును ప్రారంభించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారథితో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సత్యసాయి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను పూర్తి చేసే బాధ్యత తీసుకున్నామన్నారు. రాయలసీమను అన్ని విధాలా అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలం కార్యకర్తలని, వారికి అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు చేస్తున్న అనేక సంక్షేమ

మహానాడులో అభివాదం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులు

పథకాలు కొనసాగిస్తూనే మరో వైపు అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు దీటుగా ఎపిని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. గత వైసిపి పాలనలో అక్రమ కేసులు ఎదుర్కొన్న కార్యకర్తలకు అండగా నిలుస్తామని, ఆ కేసులన్నీ ప్రభుత్వం ద్వారా ఎత్తేసే విధంగా ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి కార్యకర్తకు రూ.100 సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన ఘనత దేశ చరిత్రలో తెలుగుదేశం పార్టీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, కందికుంట వెంకట ప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ధర్మవరం నియోజవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్, డిసిఎంఎస్ ఛైర్మన్ వెంకటేష్‌తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

22 తీర్మానాలు

జిల్లా అభివృద్ధి కోరుతూ మహానాడు వేదికగా ఆ పార్టీ నాయకులు 22 తీర్మానాలను ప్రవేశపెట్టారు. తాగు,సాగునీరు, రహదారులు, ఉద్యోగ, ఉపాధి కల్పన, టిడ్కో ఇళ్ల పూర్తి, జగన్న కాలనీల పేర్ల మార్పు, జిల్లాలో 193 చెరువులు, రెండు రిజర్వాయర్లను నీటితో నింపడం, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థల సేకరణ తదితర అంశాలపై తీర్మానం చేశారు.

అమడగూరులో వీధి కుక్కల బెడద

ప్రజాశక్తి-అమడగూరు

మండల కేంద్రమైన అమడగూరుతో పాటు మహమ్మాదాబాద్‌లో వీధి కుక్కల బెడద రోజు రోజుకూ తీవ్రమవుతోంది. మహమ్మాదాబాద్‌లో పది నుంచి పదిహేను కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. దీనికితోడు ద్విచక్ర వాహనలపై వెళ్తున్న వారిపై దాడులకు ఎగబడుతున్నాయి. దీంతో వాహనదారులు వాటి నుంచి తప్పించుకోబోయి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు సంచరిస్తూ ఉంటాయి. దీంతో ఒంటరిగా వెళ్లాలంటే స్థానికులు భయపడే పరిస్థితి నెలకొంది. విధిలేని పరిస్థితుల్లో కర్ర చేతిలో పట్టుకుని వెళ్తున్నారు. మహమ్మాదాబాద్ మెయిన్ రోడ్, కాలనీకి వెళ్లే రహదారుల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 20మందికి పైగా కుక్కకాటుకు గురైనట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మేత కోసం మహమ్మాదాబాద్ పొలం వచ్చిన గొర్రెల మందపై కూడా కుక్కలు దాడి చేయగా సుమారు 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. చిన్న చిన్న లేగ దూడలపై కూడా దాడి చేసి చంపిన సంఘటనలు ఉన్నాయి. ఇవన్నీ తెలిసినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వీధిలో తిరుగుతున్న కుక్కలు

భూనిర్వాసిత రైతుల వివరాలు పంపండి

మాట్లాడుతున్న రామసుబ్బయ్య

ప్రజాశక్తి-ముదిగుబ్బ

జాతీయ రహదారుల విస్తరణలో భూములు కోల్పోయిన రైతుల వివరాలను త్వరితగతిన పంపాలని పుట్టపర్తి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య వీఆర్వోలను ఆదేశించారు. జాతీయ రహదారి-342 విస్తరణలో భాగంగా రైతులు భూమి కోల్పోయిన విషయంపై శనివారం ఆయన తహశీల్దార్ నారాయణస్వామి, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. దానికి సంబంధించి నివేదిక తయారు చేయాలన్నారు. వివరాలు అందిన వెంటనే రైతుల ఖాతాల్లోకి నగదు జమవుతుందని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ అధికారిణి శాంతి పేర్కొన్నారు. హిందూపురం త్యాగరాజ నగర్ మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడిని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. బాలికలతో స్నేహ పూర్వకంగా ఉంటూనే వారి శారీరక, మానసిక స్థితిగతులపై ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.మాళప్ప, కె.సాయికళ, సూపర్‌వైజర్లు జయమ్మ, అనిత, సరస్వతి, మహిళా పోలీసులు విజయభారతి, అనీలా, అంగన్వాడీ కార్యకర్త తసీనా, ఉపాధ్యాయులు బిఎస్.కుమారి, మమత, శిరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి

రిమాండ్ ఖైదీల్లో మార్పు రావాలి

న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్

కారాగారాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

క్షణికావేశంలో తప్పులు చేసి ఉపకారాగారంలో ఉన్న రిమాండ్ ఖైదీల్లో మార్పు రావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలోని గదులు, మరుగుదొడ్లు, వంటగది, నిత్యావసరాలు తదితర వాటిని పరిశీలించారు. అంతకుముందు ఖైదీలతో నేరుగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ తప్పులు చేసి జైళ్లకు రావడం వల్ల కుటుంబ సభ్యుల గౌరవ మర్యాదలకు భంగం కలుగుతుందన్నారు. గ్రామంలో కూడా జైలుకు వచ్చి వెళ్లిన వ్యక్తులను దూరంగా ఉంచుతారని తెలిపారు. ప్రస్తుతం ఉపకారగారంలో ఫిర్యాదుల పెట్టె సక్రమంగా లేదని, వెంటనే ఫిర్యాదులు పెట్టెను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉపకారాగారధికారి హనుమన్నను ఆదేశించారు. ఖైదీల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, పార్వతి, భరత్ సింహా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన

న్యాయం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో గత వారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తమ బంధువు మతి చెందగా, ఈ కేసు విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మతుడి బంధువులు హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కొట్నూరు వద్ద వారం రోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వీరన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరయ్య మతి చెందాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు ఇప్పటి వరకు సంపాదించలేదని, ప్రస్తుతం వెళ్లి అడిగితే అప్పటికే డిలీట్ అయిపోయాయని

ఆందోళన చేస్తున్న వారికి నచ్చ చెబుతున్న ఎస్ఐ శ్రీధర్

నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. పోలీసులు కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నా నేపథ్యంలో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ధర్నా చేస్తున్న వారిని శాంతింపజేయడానికి పోలీసులు ప్రయత్నించారు. రెండు రోజుల్లో ప్రమాదానికి గురి చేసిన వాహనాన్ని సీజ్ చేస్తామని ఎస్ఐ శ్రీధర్ తెలపడంతో మతుడి బంధువులు శాంతించి, ఆందోళనను విరమించారు.

'అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు'

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలో వేసిన అనధికార లేఔట్లలో ఎవరూ ప్లాట్లు కొనరాదని తహశీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీవో పార్థసారథి సూచించారు. పట్టణంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ వ్యవసాయానికి యోగ్యమైన భూములల్లో అక్రమంగా లేఔట్లు వేసి ప్లాట్లు అమ్మిన వారిపై, కొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లేఔట్ వేయాలంటే పంచాయతీ అనుమతి తప్పనిసరి అన్నారు. ఆ తర్వాత అహుడా అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధ నల మేరకు ప్లాట్లు వేసి అమ్ముకోవాలని, లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లు వేస్తున్నారని, సర్వే చేయించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-హిందూపురం

2024-25 విద్యాసంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 10వ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన బెస్త విద్యార్థులకు శనివారం పట్టణంలోని మెడల్ కాలనీలో బెస్త సేవా సంఘం భవనంలో ప్రతిభా పురస్కారాలను అందించారు. బెస్త సేవా సంఘం అధ్యక్షులు బెస్త లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ తహసీల్దార్ రాములు, వెంగముని, గోరంట్ల అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదుతో పాటు అప్రిసియేషన్ సర్టిఫికెట్,

ప్రతిభా పురస్కారాలు అందించిన విద్యార్థులతో సంఘం నాయకులు

మెమెంటో, భగవద్గీత అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం బెస్త సేవా సంఘ సభ్యులు శివయ్య, శ్రీనివాసులు, మనోహర్, అనిల్, తిమ్మప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు 'వర్ష' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-గుడిబండ

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మండలంలోని వర్ష సైనిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు 14 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్.లోచన-260మార్కులు సాధించింది. అలాగే జ్ఞానేశ్, కార్తీక్ సాయి, నిఖిల్‌కుమార్, భరత్‌గౌడ్, ప్రణీత్‌నాయక్, హరీష్‌కుమార్, ధనుష్, రోహిత్, తమన్‌గౌడ్, చిదంబర, శ్రీహరి, రాజశేఖర్, అభిషేక్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు. దీంతో శనివారం స్కూల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం సన్మానించింది. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు, కరస్పాండెంట్ విటి.శ్రీనివాసులుకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు.

ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణకు
ప్రభుత్వం సానుకూలం : మైనాస్వామి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వానవోలు రహదారిలో మల్లెలగుట్టపై వెలసిన విజయనగరరాజుల కాలం నాటి ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణ పనులను చేపట్టాలన్న విజ్ఞప్తిని పరిశీలిస్తామని పర్యాటక పురావస్తు సాంస్కృతిక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ చెప్పారని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. ఆయన శనివారం స్థానిక మాధవరాయ ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టి పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతూ విజ్ఞాపన పత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించిన ఆ శాఖ కార్యదర్శి పురావస్తు శాఖ అధికారులను క్షేత్రస్థాయి పర్యటనకు పంపనున్నట్లు తెలిపారు. మల్లెల రాతిగుట్టపై రెండు ఆలయాలు విజయనగర శైలిలో నిర్మించగా ప్రస్తుతం అవి విధ్వంసానికి గురయ్యాయి.

మృతుని కుటుంబానికి 'బత్తల' ఆర్థికసాయం

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో బాలప్పగారిపల్లిలో నివాసం ఉంటున్న బెల్లల రామచంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే వైసిపి బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ వారి తండ్రి మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ చేత రామచంద్ర కుటుంబ సభ్యులకు రూ. 15వేలు అందజేశారు.

రామచంద్ర కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు సూచించారు. పట్టణంలోని మధు కంటి వైద్యశాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ హ్రస్వ దృష్టి వారోత్సవాల సందర్భంగా ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ ప్రజలకు కంటి చూపుపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. మంచి కంటిచూపుతోనే చక్కటి విద్య లభ్యమవుతుందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లల కంటి చూపు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, దగ్గర చూపు, దూరపు చూపులు కనిపెట్టాలని తెలిపారు. ఒక్కసారి దృష్టిలోపం గుర్తిస్తే క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ కళ్లద్దాలు తప్పనిసరిగా మార్చుకోవాలన్నారు. దృష్టి లోపాన్ని నివారించలేమన్నారు. లేజర్ చికిత్స వల్ల కళ్లద్దాలు అవసరం లేకుండా చేసుకోవచ్చు అన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తచెరువు : ప్రతిరోజూ యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్ తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులు యోగాసనాలు వేశారు. యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎపిఎం నారాయణ, కార్యదర్శులు నాగరాజు, వివిధ శాఖల అధికారులు, టిడిపి నేత లోచర్ల పెద్దన్న పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 82.97శాతం హాజరు

కొత్తచెరువు : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 82.97శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. మొత్తం 34 పరీక్ష కేంద్రాల్లో 3,571 మందికి 2,963 మంది హాజరయ్యారన్నారు. ఆపోస్ పరీక్షలకు సంబం ధించి జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాల్లో 105 మందికి 69 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల్లో 83 మందికి 64 మంది హాజరయ్యారని తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి

ధర్మవరం రూరల్ : పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు సూచించారు. పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో శనివారం నియోజక వర్గం లోని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలు విద్యనందించాలనే లక్ష్యంతో ముందుకు రావాలని, ఫీజుల విషయంలో కొంత వెసులుబాటు కల్పించాలని కోరారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో పాఠశాలలు తమ వంతు పాత్ర పోషించాలని, సమాజానికి సేవ చేయడంలో భాగస్వాములు కావాలని సూచించారు.

రావులచెరువులో పోలీసుల గ్రామసభ

ధర్మవరం రూరల్ : మండలంలోని రావులచెరువు గ్రామంలో శనివారం సాయంత్రం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో వెళ్లి గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో దారి విషయంలో కొందరు గ్రామస్తులు గొడవ పడుతుండగా సర్వే చేయించుకోవాలని, గొడవ పడకూడదని ఎస్ఐ హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యానికి బానిస కాకూడదని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా విత్తనవేరుశనగ

తాడిమర్రి : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని పెద్దకోట్ల, చిల్లవారిపల్లె పంచాయతీల్లోని రైతులకు సబ్సిడీపై విత్తన వేరుశెనగ పంపిణీ చేసేందుకు పెద్దకోట్ల రైతు సైవా కేంద్రంలో శనివారం స్టాక్ దింపారు. ఖరీఫ్ పంటకు విత్తన వేరుశనగ అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో అధికారులను సంప్రదించాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక

తలుపుల : స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన పదేళ్ల బాలిక రెడ్డి రాణి శుక్రవారం తప్పిపోయిన విషయం తెలిసిందే. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరసింహుడు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వ్యవసాయ పనుల నిమిత్తం అటుగా వెళ్లిన కసిరెడ్డి ధనుంజయరెడ్డి కొండారెడ్డి చెరువులో సమీపంలో బాలికను గుర్తించారు. దీంతో పోలీసులు బాలికను చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు.

కాలనీలో చేతిపంపు ఏర్పాటు

ముదిగుబ్బ : స్థానిక దొరిగల్లు రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీప కాలనీవాసులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడేవారు. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచి లక్ష్మీదేవి చెన్నరాయుడు ఎంపీడీవో దివాకర్‌కు సమస్యను వివరించారు. సర్పంచి, ఎంపిడిఒ ప్రత్యేక చొరవ తీసుకుని కాలనీలో నూతనంగా చేతిపంపులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య తీరింది.

లక్ష్మీప్రసాద్‌కు ఎంపి, ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లా ఈటీవీ సీనియర్ చీఫ్ రిపోర్టర్ ఆర్.లక్ష్మీప్రసాద్‌కు బయోడైవర్సిటీ గ్రీన్ జర్నలిస్ట్ అవార్డును ప్రదానం చేసింది. దీంతో ఆయన ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నుంచి అవార్డు పొందారు. దీంతో శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మీప్రసాద్‌కు ఎంపి బికె.పార్థసారథి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పూలబొకేలు ఇచ్చా శాలువా కప్పి సన్మానించి అభినందించారు.

లక్ష్మీప్రసాద్‌ను అభినందిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, మాజీమంత్రి

తప్పు చేసిన వారికి జైలు తప్పదు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి కక్ష సాధింపులకు పాల్పడే పార్టీ కాదని, తప్పు చేసిన వారు జైలుకు పోకతప్పదని మంత్రి సవిత తెలిపారు. పుట్ట పర్తిలో శనివారం నిర్వహించిన జిల్లా మినీ మహానాడుకు మంత్రి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూల మాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాల నలో అన్ని శాఖల్లో అవినీతి జరిగిందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. మద్యం, మైనింగ్‌లో జగన్ రూ. వేల కోట్లు దోచుకు న్నారని ఆరోపించారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా జైలు కెళ్లడం ఖాయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమంగా జరుగుతున్నాయని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వైసిపి చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు.

చిరు వ్యాపారులకు తోపుడుబండ్ల పంపిణీ

టిడిపి 44వ మహానాడు నిర్వహిస్తున్న సందర్భంగా మంత్రి సవిత నియోజకవర్గంలోని 44 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. అందులో రజకులకు ఇస్త్రీ బండ్లు, టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు.

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వ్యక్తులకు రూ. 13,08,000 సిఎం సహాయ నిధి చెక్కులను మంత్రి సవిత అందజేశారు.

పంపిణీ చేసిన తోపుడుబండ్లతో మంత్రి సవిత

మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం సిఎం సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తోందన్నారు. గోరంట్ల మండలంలోని పాల సముద్రంకు చెందిన హేమంత్‌కుమార్‌కు రూ. 53,795, గొల్ల రంగప్పకు రూ. 80,506, తోట ఉమాదేవికి రూ. 40వేలు, మంజులకు రూ. 3.5 లక్షలు, తిప్పన్నకు రూ. 1,07,145, మంజులకు రూ. 39,729, పెనుకొండ మండలంలోని కోనాపురం భాస్కర్‌కు రూ. 1,25,280, గుట్టూరు షేక్షావలికి రూ. 2,55,150, చంద్రగిరి ఉప్పర రాధికకు రూ. 71,834, కురుబవాండ్లపల్లి మాధవకు రూ. 1,00,623, పెనుకొండ లలితబాయికి రూ. 23,920, పెనుకొండ లక్ష్మీనరసమ్మకు రూ.30వేలు, సోమందేపల్లి మండలంలోని కొలిమిపల్లి శిల్పకు రూ. 30,786 చెక్కులు అందజేశారు.

రైతులకు త్వరలో విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు మే నెలాఖరులో విత్తన కాయలు పంపి ణీ చేస్తామని తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీవో నటరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడు తూ త్వరలో ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందున వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని 12,320 మంది రైతుల జాబితాన్ని సిద్ధం చేసి నివేదిక పంపారన్నారు. విత్తనకాయలను ఆయా గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు నేర్చుకొని వాటిని అనుసరిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. సిఆర్‌జెఈ నాగరాజు మాట్లాడుతూ రూ. 3 కోట్ల 'ఉపాధి హామీ' నిధులతో సీసీ రోడ్లు, రూ. 14 లక్షలు జడ్పీ నిధులతో రహదారులు వేశామన్నారు. ఈవోఆర్‌డి అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, తదితర ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎంఇఒ రెడ్డప్ప మాట్లాడుతూ పాఠశాలలు పున:ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారి నటరాజు, విద్యుత్ ఏఈ వెంకటేష్ నాయక్, ఎపిఎం నారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు గంగాధర్‌రెడ్డి, శ్రావణ్, నాగరాజు, వైస్ ఎంపిపి గంగరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

విద్యుత్ ప్రమాద బాధితులకు పరిటాల శ్రీరామ్ పరామర్శ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో గత నెల 18వ తేదీ జరిగిన విద్యుత్ ప్రమాదంలో టిడిపి నాయకుడు చిట్రా నాగభూషణ తండ్రి చిట్రా ఓబులేసు మృతి చెందగా, తల్లి చిట్రా లింగమ్మ, కురుబ లక్ష్మి గాయపడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అందుబాటులో లేని కారణంగా నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ శనివారం చెర్లోపల్లి గ్రామం వెళ్లి చిట్రా ఓబులేసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిట్రా నాగభూషణను అడిగి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. పార్టీ తరపున బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శ్రీరామ్ వెంట మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, అమర్నాథ్‌చౌదరి, కాకర్ల సురేంద్రనాయుడు, జగ్గు, కేశవ, చంద్రశేఖర్, మండల శ్రీనివాసులు, ఓబులేసు ఉన్నారు.

చిట్రా ఓబులేసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ : మండలంలోని రామస్వామితండాకు చెందిన తెలుగు మహిళ, హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతబాయ్ తండ్రి చంప్లానాయక్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ తండాకు వెళ్లి హేమలతను పరామర్శించి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శ్రీరామ్ వెంట నాయకులు రమేష్‌బాబు, కోట్ల బాబి, తుమ్మల సూరి, నరసింహయాదవ్ ఉన్నారు.

వైసిపి ఎస్టీ సెల్, యువజన విభాగం మండల అధ్యక్షుల ఎంపిక

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

వైసిపి ఎస్టీ సెల్ మండల అధ్యక్షునిగా నాయనకోటతండాకు చెందిన రమేష్‌నాయక్ నియమితులయ్యారు. రమేష్‌నాయక్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతంతో పాటు ఎస్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. అలాగే యువజన విభాగం మండల అధ్యక్షునిగా శిరగం హరినాథ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆయన మాట్లాడు తూ తనపై ఎంతో నమ్మకంతో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఈ పదవికి ఎంపిక చేశారని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతం, యువత పార్టీ వైపు ఆకర్షితుల య్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. వారి ఎంపికకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, ఎద్దుల రామసుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలకు వారు వేర్వేరు ప్రకటనల్లో ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

వైసిపి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్

యువజన విభాగం మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి

బుక్కపట్నం మండల కన్వీనర్‌గా కేశప్ప

బుక్కపట్నం : వైసిపి మండల నూతన కన్వీనర్‌గా కొత్తకోట గ్రామానికి చెందిన బిసి నాయకుడు పులగొర్ల కేశప్పను నియమించారు. ఉపాధ్యక్షుడిగా సిద్దరాం పురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మల్లేష్ ను నియమించారు. కేశప్ప మాట్లాడుతూ మండలంలో కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి అహర్ని శలు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఎన్నిక చేసిన పార్టీ అధినేత జగన్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

29న కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని యశోదమ్మ, వకీలు పెద్దయ్య కురుబ కళ్యాణ మండపంలో ఈ నెల 29వ తేదీ కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని కురుబ కళ్యాణ మండపం కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్

ధర్మవరం రూరల్ : ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ఆన్‌లైన్‌లో నమోదు, అందులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఎపిటిఎఫ్-257 ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్‌ను శనివారం రాష్ట్ర కౌన్సిలర్ బికె.ముత్యాలప్ప ప్రారంభించారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.బలరాం, స్టేట్ కౌన్సిలర్ పి.శ్రీనివాసులు, జిల్లా ఆడిటర్ వై.నాగభూషణం, మండల అధ్యక్షులు కె.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి జి.శివానంద, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు శాఖాహార ర్యాలీ

బత్తలపల్లి : స్థానిక శ్రీహరిహర పిరమిడ్ ధ్యానమందిరం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బత్తలపల్లిలో 108వ శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బత్తలపల్లిలో శనివారం ధ్యాన మండలి సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం సుమారు 200 మంది ప్లకార్డులు చేతబూని పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద నుంచి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు ధ్యాన సందేశం ఇస్తారన్నారు. ఈ ర్యాలీకి ఎస్ఐ నుంచి ముందస్తు అనుమతి పొందినట్లు తెలిపారు. ఇందులో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

పావగడ : రిజర్వేషన్ల ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు గౌరవప్రదమైన జీవితం గడపడానికి కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని కర్నాటక బహుజన సమాజవాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. తాలూకాలోని సాసలకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అన్నారు. ఆయన రాజ్యాంగంలో రిజర్వేషన్ ద్వారా అందరికీ అంబేద్కర్ సమాన అవకాశాలు కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శూలయ్య, రుద్రప్ప, తుమకూరు జిల్లా ఇన్‌ఛార్జి శివకుమార్, గోపాల్, జిల్లా అధ్యక్షుడు అంజనమూర్తి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి టి.హనుమంతరాయ, తాలూకా అధ్యక్షుడు ఎన్.తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు డిటి.నరసింహామూర్తి పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నం పంచాయతీ పరిధిలోని గోరంట్లపల్లి వెళ్లే రహదారిలో పంచాయతీ బోరు నీటి వృథాను అరికట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని గోరంట్లపల్లి గ్రామస్తులు కోరారు. గోరంట్లపల్లి వెళ్లే రహదారిలో సుమారు రెండేళ్లుగా నీరు లీక్ అవుతూ రహదారి పాచి పట్టింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం ద్విచక్ర వాహనంపై బుక్కపట్నం వస్తున్న కురుమూర్తి పాచి పట్టిన ప్రదేశంలో అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇకనైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతో పాటు రహదారిపై పాచి తొలగించాలని బాధితుడు గురుమూర్తి పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బత్తలపల్లి గ్రామంలో నరసింహులు(52) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నరసింహులుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న 2.5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, గొర్రెలను మేపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవాడు. పలు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందాడు. ఇదే క్రమంలో శనివారం మధ్యాహ్నం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో గ్రామ సమీపంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు.

జిఎస్.తండాలో మరొకరు....

గుడిబండ : మండలంలోని దేవరహట్టి పంచాయతీ జిఎస్.తండాకు చెందిన దేవరాజు నాయక్(45) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. వివరాలు.. దేవరాజునాయక్ భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీనికి తోడు వారికి పిల్లలు లేకపోవడంతో దేవరాజు తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి తన పొలంలో చింత చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. దేవరాజునాయక్ తండ్రి అర్జునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక బిసి కాలనీకి చెందిన యువతి కనిపించలేదని శనివారం ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మందల నరసింహులు కుమార్తె మందల కళ్యాణి శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తుండగా సుమారు 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. శనివారం ఉదయం తల్లిదండ్రులు నిద్ర లేచి చూడగా కూతురు కనిపించకపోయేసరికి ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి మందల నరసింహులు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు మార్కెట్‌బాబు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మార్కెట్‌బాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట జడ్పిటిసి సభ్యులు ఉమేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, కుమారస్వామి, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

జెసిబి, రెండు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-చిలమత్తూరు

అనుమతులు లేకుండా మండలంలోని కోడూరు పంచాయతీ సుబ్బారావుపేట సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న 2 ట్రాక్టర్లు, జెసిబిని శనివారం సీజ్ చేసి పోలీస్ స్టేషనకు తరలించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను సీజ్ చేశారు. మండలంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు, లేఔట్లకు మట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు దాడులు జరిపి రెండు ట్రాక్టర్లు, జెసిబిని సీజ్ చేశారు.

హత్య కేసులో న్యాయవాది అరెస్ట్
రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం

ధర్మవరం పట్టణ పట్టణ సమీపంలో గత ఏడాది మే 25వ తేదీన వెలుగు చూసిన యువ న్యాయవాది, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం జాతీయ నాయకులు సంపత్ కుమార్ హత్య కేసులో రెండవ నిందితుడు, న్యాయవాది కెసి.నాగార్జున రెడ్డిని అరెస్టు చేసినట్లు హిందూపురం డీఎస్పీ కెవి.మహేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాడు డీఎస్పీ కార్యాలయంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్ కరీంలతో కలిసి వెల్లడించారు. హిందూపురంలోని ఓ స్థలం విషయంలో నెలకొన్న వివాదంలో సంపత్‌కుమార్ దారుణ హత్యకు గురయ్యాడు. హత్య కేసుకు సంబంధించి నిందితులను పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ ఆప్‌గ్రేడ్ ఇన్స్పెక్టర్ అంజనేయులు, ఎస్ఐలు మునిప్రతాప్, మునీర్ అహమ్మద్, నరేంద్ర తదితరులు ప్రత్యేక బందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీన నిందితుడు నాగార్జున రెడ్డి కర్ణాటక రాష్ట్రం, దేవనహళ్లి సమీపంలో ఉన్న సిగ్నేచర్ క్లబ్ రీసార్ట్‌లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కాగా ఈ కేసులో రెండవ నిందితునిగా ఉన్న నాగార్జున రెడ్డిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మొదటి నిందితుడు న్యాయవాది కష్ణారెడ్డిని త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి కె.వి. మహేష్

చల్లబడిన వాతావరణం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మే నెల అంటేనే మండే ఎండలు భయపెడుతూ ఉండేవి. అటువంటిది ఈసారి మే నెల రెండవ వారం తరువాత వర్షాలు రావడంతో వాతావరణం చల్లబడింది. ఈ వారం రోజుల్లో ఉమ్మడి అనంత జిల్లాలో ఒక మోస్తరు నుంచి మంచి వర్షాలే పడ్డాయి. రాప్తాడులో అత్యధికంగా ఒకే రోజు 143 మిల్లీమీటర్లు పడింది. విడపనకల్లు, వజ్రకరూరుతోపాటు రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు, వంకలు ప్రవహించి చెరువుల్లోకి నీరొచ్చి చేరింది. పదును కావడంతో రైతులు దుక్కులు దన్నుకునే పనిలో పడ్డాయి. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అంతలోపు దుక్కులు పూర్తయితే వచ్చే నెలలో వర్షాలు ఇదే రకంగా వస్తే పంటల సాగుకు సమయత్తమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం విత్తన ధరల సబ్సిడీలు ఖరారు చేసింది. కాని పంపిణీ ఎప్పటి నుంచి అన్నది ఇంకా ప్రకటించలేదు. పంపిణీ సాధ్యమైనంత త్వరగా చేపట్టాలన్న డిమాండ్ రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

జిల్లాలో వాతావరణం కూల్‌గా మారినప్పటికీ పొలిటికల్ హీట్ మాత్రం గత వారంలో మరింతగా పెరిగింది. అధికార టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరుతోంది. ప్రధానంగా జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లోకి టిడిపి ఎమ్మెల్యేలు వెళ్లి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు తొలగించడంతో పాటు, అనంతపురం నగర పాలక సంస్థలోని మేయర్ ఛాంబర్‌లోనూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు తొలగించడం వివాదాస్పదం అవుతోంది. ప్రజాప్రతినిధుల ఛాంబర్‌లో ఏ ఫొటోలుండాలన్నది వారి ఇష్టాలను బట్టి ఉండే అవకాశముంది. ఉండటానికి వీల్లేదన్నట్టుగా అధికారపార్టీ నేతలు వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది. దీని కొనసాగింపుగా వైసిపి ఎమ్మెల్యేల తీరుపై ఫిర్యాదు చేయడమే కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు జిల్లా ఎస్పీ జగదీశ్‌కు శనివారం నాడు వినతిపత్రం అందజేశారు.

తాడిపత్రి నియోజకవర్గంలో టిడిపి, వైసిపి మధ్య మాటల యుద్ధమే కాకుండా ప్రత్యక్ష యుద్ధమూ కొనసాగే పరిస్థితులు నెలకొన్నాయి. కోర్టు అనుమతి ఉంది.. తాను తాడిపత్రికి వెళ్తానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెబుతుండగా, వస్తే అడ్డుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇద్దరి మధ్య పోరు తారా స్థాయికే చేరుతోంది. ఇదే సమయంలో రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మధ్య హంద్రీనీవాపై మాటల యుద్ధం సాగింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నియోజక వర్గాల టిడిపి మహానాడులను ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లా మహానాడులను అనంతపురం, పుట్టపర్తిలో పూర్తి చేశారు. వచ్చే వారం కడపలో జరిగే మహానాడుకు వెళ్లేందుకు ఆయా నియోజక వర్గాల నేతలు సన్నద్ధమవుతున్నారు. వైసిపి కూడా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసుకునే పనిలో ఉంది. రాయలసీమ కో ఆర్డినేటరుగానున్న ఎంపి మిథున్‌రెడ్డి అనంతపురం విచ్చేసి ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన సలహాలు, సూచనలిచ్చిరు. అధికార పార్టీ నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను అధికమించి ఏ రకంగా ప్రజల్లోకెళ్లి పనిచేయాలని చర్చించినట్లు తెలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా పార్టీ శ్రేణులను సమయత్తం చేసేందుకు దిశానిర్దేశం చేసి వెళ్లినట్టు సమాచారం. ఈ రకంగా ఈ వారంలో రాజకీయ వాతావరణం మాత్రం వాడివేడిగా సాగింది.



అనంత వీక్షణం